

ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ రేపు సమ్మె

తాడేపల్లిగూడెం:ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణ ఆపాలని బ్యాంక్ ఉద్యోగ యూనియన్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11న సమ్మె తలపెట్టినట్టు తాడేపల్లిగూడెం బ్యాంక్ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి, తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి టివి.సూర్యనారాయణ, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్-ఎస్.ప్రసాద్, ఐబియు స్టాఫ్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బి.ఏడుకొండలు, కోఆర్డినేషన్ కమిటీ నాయకులు లింగంపల్లి గాంధీ తదితరులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 200 శాఖలు, మూడు వేల ఏటిఎంలు కలిగి లాభాల్లో ఉన్నటు వంటి ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణను ఆపకుంటే జాతీయస్థాయిలో సమ్మెకు సిద్ధపడతామని హెచ్చరించారు. సోమవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు స్థానిక ఐడిబిఐ బ్యాంకు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

'మెడికల్స్'లో నిబంధనలు తూచ్..!

డాక్టర్ల చీటీ లేకుండానే మందుల విక్రయాలు
బిల్లులు ఇవ్వకుండానే యథేచ్ఛగా అమ్మకాలు
ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నా పట్టించుకునేవారే కరువు
విడి అమ్మకాల్లో రోగుల నుంచి భారీ దోపిడీ
ప్రేక్షక పాత్రకు పరిమితమైన డ్రగ్స్ కంట్రోల్ శాఖ
రెండు జిల్లాల్లో మూడు వేల వరకూ మెడికల్ దుకాణాలు




ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మెడికల్ (ఔషధాల) స్టోర్స్‌ల్లో విక్రయాలకు సంబంధించిన నిబంధనలు రెండు జిల్లాల్లో మచ్చుకైనా అమలుకాని పరిస్థితి నెలకొంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిబంధనలను అమలు చేయించాల్సిన జిల్లాలోని డ్రగ్స్ కంట్రోల్ శాఖ ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీంతో మెడికల్ స్టోర్స్ యజమానులు 'ఇచ్చిందే మందు.. చెప్పిందే ధర' అన్నట్లు పరిస్థితి తయారైంది. రోగుల నుంచి అడ్డగోలుగా దోచేస్తున్నా మెడికల్ స్టోర్సులపై ప్రభుత్వం నుంచి కనీస పర్యవేక్షణ లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. ప్రతిరోజూ రూ.కోట్లలో మందుల విక్రయాలు సాగుతుంటాయి. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ప్రధాన విభాగం మెడికల్ స్టోర్స్. దగ్గు, జ్వరం ఇలా ప్రతి రోగానికీ రోగులు మెడికల్ స్టోర్స్‌ను ఆశ్రయించాల్సిందే. జీవనశైలిలో మార్పుతో బిపి, షుగర్, కిడ్నీ, కేన్సర్, నరాల సంబంధిత సమస్యలు, ఇలా అనేక రోగాలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. నిబంధనల ప్రకారం డాక్టర్ చీటీ లేకుండా ఏ మెడికల్ స్టోర్‌లోనూ మందులను విక్రయించకూడదు. ఈ నిబంధన ఏఒక్క మెడికల్ స్టోర్‌లోనూ అమలు కావడం లేదు. యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి కీలక మందులను సైతం వైద్యుల చీటీ లేకుండా యథేచ్ఛగా మెడికల్ స్టోర్స్‌లో విక్రయించేస్తున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మోకాళ్లు, కీళ్ల నొప్పులకు సంబంధించి పెయిన్ కిల్లర్స్‌ను ఇష్టానుసారంగా అమ్మకాలు సాగించడంతో జనం కిడ్నీ సమస్యల బారిన పడుతున్నారు. యాంటీ బయోటిక్స్ సైతం అత్యధిక మోతాదు ఉన్నవి రోగులకు ఇచ్చేస్తున్నారు. ఇది రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇటీవల పలు మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేసినప్పుడు అనుమతి లేని మందులను సైతం విక్రయిస్తున్నట్లు బయటపడ్డాయి. అంతేకుండా తమకు లాభాలు అధికంగా వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారు. డాక్టర్ చీటీ లేకుండా మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నా ఏఒక్కరికీ పట్టడం లేదు. ముఖ్యంగా సామాన్య ప్రజానీకంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. మెడికల్ దుకాణం ఏర్పాటు చేసే వ్యక్తికి ఫార్మసీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. మెడికల్ దుకాణాలు నడుపుతున్న సగం మందికి ఫార్మసీ సర్టిఫికెట్లు లేవు. ఫార్మసీ చదువుకున్న వ్యక్తి పేరున మెడికల్ స్టోర్స్ ఏర్పాటు చేసి విక్రయాలు సాగించేస్తున్నారు. వైద్యులతో సంబంధం లేకుండా వారే రోగులకు మందులు ఇచ్చేస్తున్నారు. తలనొప్పి అని వెళ్తే ఆ మందుతోపాటు మరో రెండు, మూడు రకాల మందులను అంటగడుతున్న పరిస్థితి ఉంది. ఇవి ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతున్నాయి. మందుల విక్రయాలపై ఎటువంటి పర్యవేక్షణా లేకపోవడంతో జనం తీవ్రంగా నష్టపోతున్నారు.

బిల్లు ఇవ్వకుండా మందుల విక్రయాలు

ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. మెడికల్ స్టోర్స్‌లో ఎక్కడా బిల్లు అనేది ఇవ్వని పరిస్థితి ఉంది. రూ.వేలల్లో మందులు కొనుగోలు చేసినా బిల్లు మాత్రం ఇవ్వడంలేదు. ఒకవేళ గట్టిగా అడిగితే చిన్న పేపర్‌పై రాసి ఇస్తున్న పరిస్థితి ఉంది. అధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా పట్టించుకోని దుస్థితి. బిల్లులు లేకుండా రూ.కోట్లలో మెడికల్ వ్యాపారం సాగిపోతుంది. మెడికల్ స్టోర్స్ నుంచి అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందడం కారణంగానే పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులోని పెద్ద మెడికల్ స్టోర్స్‌లో సైతం బిల్లు ఇవ్వకుండా యథేచ్ఛగా అమ్మకాలు సాగించేస్తున్నారు. విడి అమ్మకాల్లో రూపాయి ఖరీదు చేసే మందుబిళ్లకు సైతం రూ.ఐదు, అంతకు మించి వసూలు చేస్తూ జనాలను లూటీ చేస్తున్న పరిస్థితి ఉంది. ఆసుపత్రుల్లో సొంతంగా మెడికల్ స్టోర్‌లు ఏర్పాటు చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు సాగిస్తున్నా పట్టించుకునేవారే లేకుండాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ స్టోర్స్‌పై పర్యవేక్షణ పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని జనం కోరుతున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఆర్థికంగా, సామాజికంగా బలపడాలంటే విద్యతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పేదరికం నుండి బయటకు రావాలంటే ఒక్క విద్యతోనే సాధ్యమన్నారు. గిరిజనుల జీవన విధానాన్ని తాను చాలా దగ్గర నుంచి చూశానన్నారు. రంపచోడవరంలో పని చేసినప్పుడు గిరిజనులకు న్యాయమైన విద్య, వైద్యంతోపాటు వారి జీవనోపాధి కల్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, వసతిగృహాధికారి డి.శ్రీనివాస్, సిబ్బంది జి.దుర్గారావు, బి.కమలకుమారి, శ్యామ్, శరత్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

15వ తేదీకి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భవ్య భీమవరం కార్యక్రమంలో భాగంగా గాంధీజీ విగ్రహం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. భీమవరం బొంబే స్వీట్స్ కూడలిలోని గాంధీజీ విగ్రహం వద్ద బాంబే స్వీట్స్ యాజమాన్యం పోతారి బాపిరాజు చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. గాంధీజీ విగ్రహం ప్రాంగణంలో లాన్, మొక్కల ఏర్పాటు, వాటర్ ఫౌంటెన్, పెయింటింగ్, బ్యాక్‌డ్రాప్ పనులపై ఆరా తీశారు. ఈ నెల 15 నాటికి చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. బాంబే సీట్స్ యాజమాన్యం, దాత పోతారి బాపిరాజు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

11న సిపిఎం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - తణుకు

సిపిఎం జిల్లా విస్తృత సమావేశం ఈ 11న తణుకులో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి 250 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, పేదలపై విద్యుత్ ఛార్జీల మోత, స్మార్ట్ మీటర్ల వంటి అంశాలు చర్చించనున్నారని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, వి.ఉమామహేశ్వరరావు విచ్చేస్తారని తెలిపారు.

సరిహద్దులు మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

దళిత సంఘాల నేతలు డిమాండ్



మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఉండి

పాములపర్రులోని దళిత శ్మశాన వాటికకు సంబంధించిన సరిహద్దులను మార్చి, దళితులను మోసగించిన అధికారులపై తక్షణమే జిల్లా కలెక్టర్ శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని ఎపి బహుజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు తాళ్లూరి మధు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి క్రాంతిబాబు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా దళిత శ్మశాన వాటికలో రహదారి నిర్మించొద్దని దళితులు చేస్తున్న పోరాటానికి దళిత నేతలు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లూరి మధు, క్రాంతిబాబు, స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్వా చెరువులను ధ్వంసం చేస్తానని పలుమార్లు చెప్పిన స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్వా చెరువులకు వెళ్లేందుకు రహదారి నిర్మించడానికి పూనుకోవడం దారుణమని విమర్శించారు. 2009లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి దళితవాడకూ జనాభాతో సంబంధం లేకుండా రెండెకరాల శ్మశాన భూమి ఉండాలని 1235 జిఒ జారీ చేసిందని గుర్తు చేశారు. జిల్లాలో 80 శాతం దళితవాడల్లో శ్మశాన భూమి కేటాయించలేదని, గత ప్రభుత్వం అత్యవసరంగా 45 రోజుల్లో ఎస్‌సి పేటలకు శ్మశాన భూమి కేటాయించాలని చెప్పిందన్నారు. 45 సెంట్లు శ్మశాన భూమి ఉన్న పాములపర్రు దళితవాడకు 2023లో పంచాయతీ 82 సెంట్లు శ్మశాన భూమిని దళితపేటకు కేటాయిస్తున్నట్లు తీర్మానం చేసిందని గుర్తు చేశారు. అయితే గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులను దుర్వినియోగపరుస్తూ, గత తహశీల్దార్ ఇచ్చిన స్వాధీన పత్రాన్ని మారుస్తూ, శ్మశాన భూమి సరిహద్దులను మారుస్తూ తహశీల్దార్‌కు లేఖ రాయడంపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపించి గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని దళితుల స్వేచ్ఛకు విఘాతం కల్పిస్తూ పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని. వీటిని వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. తాము అభివృద్ధికి అడ్డం కాదని, రఘురామకృష్ణరాజు ఈ విషయాలన్నిటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించుకుని తమ దళితపేటకు న్యాయం చేయాలని వారు కోరారు. పోలీసులు దళితవాడలోని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వెంటనే పోలీస్ పికెట్ ఎత్తివేయాలని, మరో గరగపర్రు ఉద్యమం కాకముందే కలెక్టర్ సమక్షంలో శాంతియుత వాతావరణంలో సామరస్య పూర్వకంగా చర్చలు జరిపితే చర్చలకు రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. లేనిపక్షంలో అన్ని సంఘాలనూ ఏకం చేసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో ఎపి బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిరుదుగడ్డ రమేష్‌బాబు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మాదాసి గోపి, స్థానిక నాయకులు దానం విద్యాసాగర్, దర్శి పరదేశి, దర్శి సాల్మన్ రాజు, దర్శి బాబి, మహిళలు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీనే కీలకం

టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న - ఘనంగా ఎపి నిట్ ఏడో స్నాతకోత్సవం



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి వి.రాజన్న

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ భవిష్యత్తుకు డిజిటల్ టెక్నాలజీనే ప్రధాన చోదక శక్తిగా మారనుందని టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లో విద్యనభ్యసించిన 2021-25 బ్యాచ్ విద్యార్థులకు ఏడో స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఇంజినీర్లేనని తెలిపారు. ప్రపంచంలో నాల్గో ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరించబోతుందన్నారు. డిజిటల్ లావాదేవీల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఉందన్నారు. 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లతో యుపిఐ వంటి ప్లాట్‌ఫామ్‌లు ద్వారా ఏటా వంద బిలియన్లకుపైగా లావాదేవీలు నిర్వహిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా, ఆయా రంగాల్లోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు నిరంతర వృద్ధితోపాటు విజయాలను సొంతం చేసుకోవాలంటే అధునాతన సాంకేతికతపై పట్టు సాధించాలని, అప్పుడే లక్ష్యాలు, ఆకాంక్షలు నెరవేరతాయని చెప్పారు. కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందించడానికి సహాయపడే లెర్నింగ్ టు లెర్న్ కోర్సును ప్రవేశపెట్టాలని ఆలోచన చేస్తున్నాయన్నారు. 21వ శతాబ్దపు నిరక్షరాస్యులు చదవలేని, రాయలేని వారే కాదని, తిరిగి నేర్చుకోలేనివారే నిరక్షరాస్యులని అన్నారు. ప్రతి విద్యార్థీ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆరోగ్యమే సంపద అని చెప్పారు. విద్యార్థులు నిత్యం యోగా, వ్యాయామం, నడక, పరుగు, క్రీడలు వంటి వాటి కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. నచ్చిన పుస్తకాలను చదవటం, సంగీతాన్ని వినటం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని వివరించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఎపి నిట్‌లో విద్యార్థులు సంపాదించుకున్న జ్ఞానం, ఆధునిక నైపుణ్యాలు తమ జీవితాల్లో ముందడుగు వేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికత అంశాలు ఆవిష్కృతమవుతున్నాయని, వాటిలో మెళకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారే అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారని చెప్పారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ, నూతన ప్రాజెక్టులు చేపడితే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడంతోపాటు కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థకు చెందిన పలువురు ప్రొఫెసర్లు భారత ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే పలు ప్రాజెక్టులను దక్కించుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. సంస్థ పురోగతి నివేదికను అందజేశారు. అనంతరం 2021-25 బ్యాచ్‌లో ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న 667 మంది విద్యార్థులకు డిగ్రీలు, పిహెచ్‌డి పూర్తి చేసిన 29 మంది పరిశోధన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. వీరితోపాటు కోర్సుల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందించారు. బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన కలిదిండి పవన్ తేజ సత్యవర్మకు ఇనిస్టిట్యూట్ తరపున, కోర్సుల వారీగానూ రెండు బంగారు పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఇనిస్టిట్యూట్ గోల్డ్ మెడల్ అందుకుంటున్న కలిదిండి పవన్‌తేజ్ సత్యవర్మ

వెనుక కూర్చున్న వారికీ హెల్మెట్ తప్పనిసరి : ఎంవిఐ ప్రసాద్

ప్రజాశక్తి - ఆకివీడు

ద్విచక్ర వాహనాలను నడిపేవారితోపాటు వారి వెనుక కూర్చునే వారికి సైతం హెల్మెట్ తప్పనిసరి అని రవాణా శాఖ ఎంవిఐ కెఎస్ఎన్.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఇటీవల సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చిందని ఆయన చెప్పారు. స్థానిక ఒఎంజెఎన్‌టి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ డీలర్ కంభంపాటి కృష్ణమూర్తి స్థానిక దత్తాశ్రమంలో మోటార్ సైక్లిస్టులకు ఆదివారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎంవిఐ ప్రసాద్ మాట్లాడుతూ హెల్మెట్ లేనివారికి రూ.వెయ్యి జరిమానా విధించాల్సి ఉంటుందన్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం వరకు మోటర్ సైకిల్ ప్రమాదాలేనని వివరించారు. వాటిలో 90 శాతం వరకు హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని గుర్తు చేశారు. వీటివల్ల ప్రాణాపాయం, అంగవైకల్యం ఏర్పడుతున్నాయని, వీటి నుంచి ప్రతిఒక్కరూ అధిగమించాలని చెప్పారు. ఇవి కాకుండా ప్రతిఒక్కరూ లైసెన్సులు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో లైసెన్స్ లేని వారు ఎక్కువమంది తిరుగుతున్నారని చెప్పారు. మోటార్ సైకిల్‌పై ప్రయాణించేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడటం సరైన విధానం కాదన్నారు. ఇది ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. హెచ్‌పిసిఎల్ జిల్లా సీనియర్ సేల్స్ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కంపెనీ వ్యాపార దృక్పథంకన్నా సేవా దృక్పథానికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. గ్యాస్ సమస్యలను పరిష్కరించేందుకు 1906 కాల్ చేయాలని సూచించారు. గ్యాస్ ప్రమాదాలు సంభవించకుడా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, ఒఎంజెఎన్‌టి సలహాదారు కె.సత్యనారాయణరాజు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.



వాహనదారులకు హెల్మెట్లు అందజేస్తున్న ప్రసాద్

భారాలు.. ఆందోళనలు

పాలకుల భారాల మోతకు వ్యతిరేకంగా రెండు జిల్లాల్లో ఆందోళనలు మిన్నంటాయి. గతానికి భిన్నంగా మరోసారి పాలకుల చర్యలు.. వామపక్షాల ప్రతిస్పందనలపై జనంలో పెద్ద ఎత్తున చర్చ సాగడం మంచి పరిణామంగా చెప్పకోవచ్చు. స్మార్ మీటర్లు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యాన చేపట్టిన ధర్నాలు విజయవంతమయ్యాయి. వివిధ తరగతుల ప్రజానీకం ఈ ఆందోళనకు మద్దతు పలకడం భారాల ప్రభావాన్ని చెప్పకనే చెబుతోంది.



విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు కేటగిరి-2 కనెక్షన్లకు పెద్ద ఎత్తున సాగింది. ఆ సమయంలో వామపక్షాలు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తూ ప్రచారం సాగించినా దాని ప్రభావం మాత్రం ఇప్పుడిప్పుడే కన్పిస్తుండఎంతో జనం రోడ్డెక్కుతున్నారు. చిన్నపాటి పచారీ దుకాణానికి గతంలో రూ.500 లోపు కరెంటు బిల్లు వస్తే స్మార్ట్ మీటర్ బిగించాక రూ.వెయ్యికిపైగా వస్తుండఎం అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై స్థానికంగా ఉండే లైన్‌మెన్లను వివరాలు అడిగినా ఎఇ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారని, అక్కడకు వెళ్తే డిఇ కార్యాలయం అంటూ స్పష్టమైన సమాధానం చెప్పేవారే కరువయ్యారని వాపోతున్నారు. దీంతో కాగితాలు పట్టుకుని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎటువంటి స్పందనా ఉండఎం లేదని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన చేపట్టిన సంతకాల సేకరణ సందర్భంగా బాధితులు చెప్పడమే దీనికి నిదర్శనం. అదే సమయంలో ట్రూఅప్ ఛార్జీల భారం జనాన్ని తీవ్ర వేదనకు గురి చేస్తోంది. మొత్తంగా విద్యుత్ భారాల మోత అటు వైసిపి హయాంలోనూ, ఇటు కూటమి ప్రభుత్వ హయాంలోనూ ఒకేలా ఉందంటూ జనం వామపక్షాలు, ప్రజాసంఘాలు చేపట్టిన ధర్నాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారు కొందరైతే, పరోక్షంగా మద్దతు తెలిపిన వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. మొత్తంగా పాలకుల విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా జనం కదులుతున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఇక మన ప్రధాని మోడీకి మంచి మిత్రునిగా చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశ ఉత్పత్తులపై విధించిన సుంకాల భారంతో జిల్లాలోని ఆక్వా రంగం మరోసారి తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. గతంలో సుంకాల భారం మోత మోగించినప్పుడు రొయ్యల ధర గణనీయంగా పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ సారీ అదే పరిస్థితి కన్పిస్తోంది. కౌంట్‌కు సుమారు రూ.40 నుంచి రూ.పది వరకూ తగ్గిపోయిన పరిస్థితి ఉంది. దీంతో ఇటు రైతులు, అటు ఎగుమతిదారులు నష్టపోయే దుస్థితి దాపురించింది. అటు సుంకాలకు వ్యతిరేకంగా, ఇటు ఆక్వా రంగాన్ని ఆదుకునేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన ప్రకటనా రాకపోవడం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పెద్దలు సైతం స్పందించకపోవడంపై ఆక్వా రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ రాయితీ అమలు కాక, ఛార్జీల భారం భరించలేకపోతున్నామని లబోదిబోమంటున్నారు. ప్రధానంగా వాడిన కరెంటు కన్నా ట్రూఅప్, ఇతర ఛార్జీల పేరుతో విద్యుత్ బిల్లుల బాదుడు దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. అదనపు ఛార్జీలు రద్దు చేసి వినియోగించిన విద్యుత్ వరకే బిల్లులు పరిమితం చేయకపోతే ఆక్వా రైతులు సాగు దూరం కావడం తప్ప మరో మార్గం కన్పించడం లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వా రంగ పరిరక్షణకు అమెరికా సుంకాల భారం, విద్యుత్ ఛార్జీల మోత నుంచి తప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపడతాయో వేచిచూడాలి. లేనిపక్షంలో ఆక్వా రైతులు, ఆ రంగానికి సంబంధించిన వారు రోడ్డెక్కే సూచనలైతే స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఇక మా పని మమ్మల్ని చేయనీయండి, ఇతర పనులు, యాప్‌ల భారం తగ్గించాలంటూ ఇటు ఉపాధ్యాయులు, అటు అంగన్వాడీలు ఆందోళన బాట పట్టారు. తమను బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు రెండు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. గతంలో అన్ని యాప్‌లూ ఒకే యాప్‌గా మార్చినా అదే భారం కొనసాగుతోందని, తరచూ సర్వర్ సమస్య వస్తోందని ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. దీనికితోడు అర్జంట్ మెసేజీ, వెరీ అర్జెంట్ మెసేజీ అంటూ ఒకే సమాచారాన్ని రెండు రోజులకోసారి తిప్పితిప్పి అడుగుతూ మానసికంగా వేధిస్తున్నారని వాపోతున్నారు. తక్షణం బోధనేతర పనుల నుంచి తమను మినహాయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇక అంగన్వాడీలు ఆన్‌లైన్ పనులు భారంగా మారాయని, గతంలో ఇచ్చిన 2జీ ఫోన్లతో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందంటూ తమ ఫోన్లను ఆయా సిడిపిఒ కార్యాలయాల్లో అందజేసి నిరసన తెలిపారు. తమకు 5జి ఫోన్లు ఇవ్వడంతోపాటు యాప్‌ల భారం తగ్గించాలని కోరుతున్నారు. అంటే పాలకుల విధానాల ఫలితంగా పేద ప్రజల నుంచి చిరుద్యోగులు, మధ్యతరగతి ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని స్పష్టమవుతోంది. ఇదే భారాల మోత కొనసాగితే ఆయా తరగతుల ప్రజలు సైతం రోడ్డెక్కుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

అడుగడుగునా గోతులు.. ప్రజలకు పాట్లు

అధ్వానంగా పెదఅమిరం-ఏలూరుపాడు రాష్ట్రీయ రహదారి




కాళ్లకూరు వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - కాళ్ల

ఇటీవల కురిసిన వర్షాలకు జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఇప్పటికే ఉన్న గోతులు వర్షపు నీటితో నిండి ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారాయి. మండలంలోని పెద అమిరం నుంచి ఏలూరుపాడు వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. ఏలూరుపాడు నుంచి జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, దొడ్డనపూడి, సీసలి, జక్కరం, పెదఅమిరం, భీమవరం ఈ మార్గంలోనే వెళ్లాలి. అంతేకాదు భీమవరం నుంచి విజయవాడ వెళ్లే బస్సులన్నీ ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తాయి. కాళ్లకూరు, కాళ్ల, జక్కరం గ్రామాల్లో రోడ్డు పెద్దఎత్తున దెబ్బతింది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లేవారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ఏది గొయ్యో తెలియని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని జనం కోరుతున్నారు.

కాళ్ల సొసైటీ ఛైర్మన్‌గా రామాంజనేయులు



ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల విశాల సహకార పరపతి సంఘం బ్యాంకు ఛైర్మన్‌గా ఎరుబండి రామాంజనేయులు (రాము) నియమితులయ్యారు. కోమటిగుంట గ్రామానికి చెందిన ఎరుబండి రామాంజనేయులు (రాము) ప్రస్తుతం జనసేన కాళ్ల మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనకు కూటమి నాయకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. రామాంజనేయులు శనివారం మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

కోపల్లె సొసైటీ ఛైర్మన్‌గా రామరాజు



ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా నంద్యాల రామరాజు (హాట్ లైన్స్ బాబు) నియమితులయ్యారు. జక్కరం గ్రామానికి చెందిన నంద్యాల రామరాజు (హాట్ లైన్స్ బాబు) టిడిపిలో గత 30 ఏళ్ల నుంచి రాజకీయవేత్తగా, మరో వైపు వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. గతంలో ఆయన సొసైటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం సొసైటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనకు కూటమి నాయకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామ కృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

యుకెసి ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో విజయ లాబ్ వారిచే పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద వాకర్స్‌కు శనివారం ఉచిత షుగర్ నిర్ధారణా పరీక్షలు నిర్వహించారు. 150 మంది వాకర్స్‌కు షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కానూరి ప్రభాకరరావు, గుండుమోగుల వీరాస్వామి, కోండ్రెడ్డి సూరిబాబు, కొమ్ముల మురళి, జక్కంపూడి మదన్, ఇనుకొండ శేషాద్రి, ఉనికెల శ్రీనివాస్, గంధం ఏసుపాదం, సత్తినీడి రాజా పాల్గొన్నారు.

ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ - మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహేష్‌బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసిపి నాయకులు వైట్ల కిషోర్ కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మనవర్తి విజయ్ కుమార్, బోట్ల చక్రధర్, మనవర్తి శుభకరరావు, కానుమిల్లి ప్రసాద్, దొమ్మేటి సుబ్బారావు, బాబ్జీ టైలర్, పడమట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు అమరజీవుల వర్ధంతి

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఆచంట మండలంలో అమరజీవుల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలో సిపిఎం పెనుమంచిలి శాఖ ఆధ్వర్యంలో అమరజీవులు నార్గన నరసింహమూర్తి, పంది నరసింహమూర్తి, ఆచంట వేమవరం శాఖ ఆధ్వర్యంలో కరుటూరి సత్యనారాయణ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు గోపాలన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల, శాఖా కార్యదర్శులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - తణుకు

మండలంలోని పైడిపర్రులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి గాయాలపాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఏలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు తణుకు బస్టాండ్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి ఎక్కుతున్న క్రమంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యార్లగడ్డ రవిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితుడి ఎడమకాలు నుజ్జునుజ్జు కావడంతో తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు రవి తణుకు కోర్టులో లేఖరుగా పనిచేస్తున్నట్లు సమాచారం. తణుకు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కాళ్ల

కలవపూడి పంట కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యం కావడంతో స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కలవపూడి గ్రామానికి చెందిన గొట్టుముక్కల సత్యవతి (68) శుక్రవారం రాత్రి నుంచి కనిపించలేదు. పంట కాలువలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, (ఇన్‌సెట్‌లో మృతి చెందిన గణేష్)

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - నరసాపురం

నల్లిక్రీక్‌లో గల్లంతైన గణేష్ మృతదేహం శనివారం లభ్యమైంది. చినలంక బీచ్‌లో స్నేహితులతో సరదాగా గడిపి ఇంటికి తిరిగొస్తూ కాళ్లకు అయిన మట్టిని కడుకునేందుకు నల్లిక్రీక్‌లో దిగిన పాలిటెక్నికల్ విద్యార్థి గట్టం గణేష్ (20) శుక్రవారం గల్లంతైన సంగతి విదితమే. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గట్టం గణేష్ ముగ్గురు మిత్రులతో కలిసి చినలంక బీచ్‌కు వెళ్లాడు. అక్కడ సరదాగా గడిపి బైక్‌లపై తిరుముఖం పట్టారు. ఈ క్రమంలో కాళ్లు కడుగుకునేందుకు గణేష్ నల్లిక్రీక్‌లో దిగాడు. మిగిలిన స్నేహితులంతా ఒడ్డునే ఉన్నారు. ఆ సమయంలో నీటి ప్రవాహం ఎక్కువుగా ఉంది. సుడులు కూడా వేగంగా ఉన్నాయి. గణేష్ గమనించలేకపోయాడు. నీళ్లలోకి దిగగా కాలు జారింది. ఆ సమయంలో మధ్యలో సుడి ఉండడంతో ప్రవాహంలో కొట్టుకు పోయాడు. కేకలు వేయడంతో స్నేహితులు గుర్తించారు. వీరు గ్రామానికి వెళ్లి మత్స్యకారులను తీసుకొచ్చేలోపు గణేష్ ఆచూకీ తెలియలేదు. రాత్రి సమయంలో సైతం పడవలతో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం గల్లంతైన ప్రదేశానికి కొద్ది దూరంలో తూములో గణేష్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న విప్ నాయకర్, టిడిపి నియోజకవర్గ పొత్తూరి రామరాజు, సర్పంచి ఒడుగు ఏసు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు మైలా వసంతరావులు, తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. సాయంత్రం మృతదేహం లభ్యమవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయారు. ఆమె తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ఏటిగట్టు శివారులో పోలీసులు శనివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,770 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ముఖ్యంగా యువకులు దేశ ప్రగతికి పాటుపడాలని స్థానిక ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక దీక్ష డి అడిక్షన్ అండ్ డ్రగ్ రీహబిలిటేషన్ సెంటర్‌లో కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యపానం, మత్తు పదార్థాల వ్యసన విముక్తి కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజలు, యువకులు, కష్టపడి జీవనం సాగించే శ్రామికులు, మద్యపానం, మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆనంద మయ జీవనాన్ని గడపాలని ఆమె ఆకాంక్షించారు. మత్తు పదార్థాలకు దూరంగా యువశక్తి నిర్వీర్యం కాకుండా సమాజ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ స్వరాజ్యలక్ష్మి

హితం కోసం గత 13 సంవత్సరాలుగా, స్వచ్ఛందంగా సేవ చేస్తున్న దేవీ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న దీక్ష డి - అడిక్షన్ అండ్ డ్రగ్ రీహబిలిటేషన్ సెంటర్ వారి సేవలను అభినందించారు. వ్యసనాలకు అలవాటు పడే వారిని గుర్తించి ఈ వ్యసన విముక్త కేంద్రంలో చేర్పించాల్సిన ఆవశ్యకతను సిబ్బందికి తెలిపారు. సామాజిక బాధ్యతగా ఇటువంటి సంస్థలకు అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. మెరుగైన సమాజం కోసం ఉద్యోగులు ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. దీక్ష డి - అడిక్షన్ అండ్ డ్రగ్ రీహబిలిటేషన్ సెంటర్ నందు చికిత్స పొందుతున్న వారికి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు జి.మురళీ మోహనరావు, ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకుల సంక్షేమ సేవా సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎరుకుల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో జరిగింది. అధ్యక్షులుగా కుర్ర గోవింద్, ఉపాధ్యక్షులుగా సాలా చిన్న, ప్రధాన కార్యదర్శిగా మనుపాటి పెద్దిరాజు ఎన్నికయ్యారు. అలాగే సంఘం సభ్యులుగా బెల్లం కొండా కృష్ణ, కుతడి కిషోర్, సాల మాసరియ్య, కుతడి శ్రీను, బండారి సత్తి బాబు, దేవరకొండ భోగేశ్వరరావు ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సాలా మల్లేశ్వరరావు, బెల్లంకొండ చినబాబు, బండి రుద్రయ్య, సాలా పండు, మానుపటి శ్రీను పాల్గొన్నారు.

వాతావరణం గందరగోళం

ప్రజాశక్తి - మొగల్తూరు

శ్రావణ మాసంలోనూ రోహిణి కార్తె మాదిరి ఎండలు భగ్గుమంటున్నాయి. ఉదయం 10 గంటలు దాటేసరికి ఎండ వేడిమి ఎక్కువ కావడంతో ప్రజలు రహదారులపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎండల తీవ్రత కొనసాగుతోంది. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యవసాయ కూలీలు, చిరువ్యాపారులు, కార్మికులు ఎండ వేడిమికి విలవిల్లాడుతున్నారు. ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడం కోసం ప్రజలు వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణంలో అనూహ్య మార్పులతో టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల బాటపడుతున్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

ప్రజాశక్తి - తణుకు

కుటుంబాల్లో సోదర భావంతోపాటు అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రక్షాబంధన్ పురస్కరించుకుని శనివారం ఎంఎల్ఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మహిళలు ఎంఎల్ఎకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



తణుకు : రాఖీ కటించుకుంటున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ



పెనుమంట్ర: మార్టేరులో

సందర్భంగా వారిని ఆశీర్వదించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలోని అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సీసాలు ఏరుకొని, వాటిని అమ్మడం ద్వారా జీవనం సాగించే కొందరు శ్రామిక మహిళలతో రాఖీ కట్టించుకొని, ఉదారంగా నగదు కానుక ఇచ్చారు ఓ టీ షాప్ యజమాని. ఈ సంఘటన మండలంలోని మార్టేరు గ్రామం కోడేరు రోడ్డు చర్చి సెంటర్‌లో జరిగింది. శనివారం రాఖీ పండుగ సందర్భంగా స్థానిక టీ షాపు యజమాని పట్నాల నగేష్‌కు కొంతమంది శ్రామిక మహిళలు వచ్చి రాఖీలు కట్టారు. ఈ ప్రాంతంలో ఈ మహిళలు ప్రతి రాఖీ పండుగ రోజున వచ్చి ఇలా ఆత్మీయంగా తన చేతికి రాఖీలు కట్టి వెళ్తుంటారని ఆయన అన్నారు.

మొగల్తూరు : మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు గ్రామాలకు వచ్చారు. దీంతో సందడి నెలకొంది. సోదరులకు అక్కా చెల్లెళ్లు రక్షాబంధన్ కట్టారు. మిఠాయిలు తినిపించారు.

నరసాపురం : నరసాపురం నియోజకవర్గ జనసేన కార్యాలయంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. అనంతరం ఇద్దరు చిన్నారులు, వీర మహిళలు వారికి రాఖీలు కట్టారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతారావు

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థులు ఉన్నత ఆశయమే లక్ష్యంగా విద్యాభ్యాసం కొనసాగించాలని లయన్స్ క్లబ్ ఆకివీడు అధ్యక్షులు బుద్ధన చింతారావు సూచించారు. విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ చుక్కర్ల బలరాం బాబు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ సంతకంతో పది మంది సమాజంలో ఫలితం పొందే స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థుల స్థాయి పెరిగితే సంతకానికి వెలుగు పెరుగుతుందన్నారు. అందుకోసం ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. చదువుతోపాటు నైతిక విలువలు క్రమశిక్షణ అత్యంత అవసరమన్నారు. మంచి ఆలోచనలతో దీర్ఘకాలిక



మాట్లాడుతున్న చింతారావు

ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ఉన్నత ఆశయంతో స్థాపించిన విద్యా వికాస్ కళాశాల మీ అందరితో బహుముఖంగా ఉపయోగపడిందన్నారు. విద్యార్థుల ఆర్థిక స్థితి ఆధారంగానే ఇక్కడ ఫీజులు వసూలు చేయడం వారి ఆశయానికి చిహ్నం అన్నారు. సమావేశంలో లయన్స్ ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో విద్యార్థులు సంస్కారవంతమైన అలవాట్లు నేర్చుకోవాలని అన్నారు. ప్రతి ఆడపిల్లనూ తమ సోదరిగా భావించాలన్నారు. కళాశాల డైరెక్టర్ కమ్మెలు సుబ్రహ్మణ్యం, కళాశాల ప్రధాన సలహాదారు ముత్యాల వెంకటస్వామి మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను గౌరవించడం తమ కళాశాలలో సాంప్రదాయం అన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

త్వరలో నల్లిక్రీక్‌పై వంతెన నిర్మిస్తాం

విప్ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చినలంక వద్ద నున్న నల్లిక్రీక్‌పై త్వరలో వంతెన నిర్మిస్తామని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. శనివారం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి శిథిలావస్థకు చేరిన నల్లిక్రీక్ పనులను పరిశీలించారు. నల్లిక్రీక్ పూర్తిగా ధ్వంసం అయిపోవడం వల్ల తీర ప్రాంతం నుంచి మత్స్య సంపద తెచ్చుకునేందుకు మత్స్యకారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన ధ్వంసం కావడంతో వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై స్పందించిన విప్ నాయకర్ త్వరలో వంతెనకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి పనులు చేపడతామన్నారు. అలాగే నల్లిక్రీక్ పూర్తిగా తవ్వి మత్స్యకారులకు ఉపాధి దొరికేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మైలా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



నల్లిక్రీక్ వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ నాయకర్, రామరాజు

9 మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేశాం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలో మొత్తం తొమ్మిది మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని ఎంఇఒ వీరాస్వామి తెలిపారు. పాలకొల్లు మండల ప్రజా పరిషత్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షత వహించారు. గత ఏడు నెలలలో ప్రతి గ్రామంలోనూ లోవోల్టేజీ సమస్య లేకుండా ఇప్పటివరకు 50 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాస్ తెలిపారు. పాలమూరు గ్రామ సర్పంచి పివిఎల్ఎన్ స్వామి నాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకూ ఐసిడిఎస్ అధికారులు ఎవరో తమకు తెలియదని, అసలు ఆ శాఖలో ఏం జరుగుతుందో ప్రజా ప్రతినిధులకు తెలియడం లేదని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిపి కనకలక్ష్మి

వ్యవసాయాధికారులు గ్రామంలో రైతులకు ఏ విధంగా సహాయపడుతున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పారుదల సంఘం అధ్యక్షులు పులపర్తి వీర రాఘవులు మాట్లాడుతూ పంట, తాగునీటి కాలువలు డంపింగ్ యార్డులుగా మారాయని, గృహాల్లో వినియోగించిన చెత్తనంతటినీ కాలువల్లో పడేసి నీటిని కలుషితం చేస్తున్నారని తెలిపారు. అధికారులు, సర్పంచులు సమస్యపై దృష్టి సారించి నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం సెలవు కావడంతో చాలా మంది అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కాలేదు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎండిఒ మూర్తిబాబు, వైఎస్ ఎంపిపి సునీల్, టిడిపి ఫ్లోర్ లీడర్ శాగ సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీలు పాల శ్రీనివాస్, లింగం సత్యనారాయణ, గుడాల హరిబాబు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. పట్టణంలో ప్రెస్‌క్లబ్ భవనంలో జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా కేతినీడి రంగ, కార్యదర్శిగా వి.ఎ.కుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా తమ్ముశెట్టి బాబు, ఉపాధ్యక్షులుగా కర్రింశెట్టి శ్రీను, బొడ్డు భగవాన్, నాని, చెరుకూరి రాజేష్, సహాయ కార్యదర్శిగా అనంత బాబి, సీమకుర్తి బాలాజీ, కడిమి తాతారావు, ఇంటి బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా తాడి జీవన్, వాసా ఈశ్వర్, తాతాజీ, కె.ఉమా శంకర్ ఎన్నికయ్యారు. కొత్త కమిటీని సీనియర్ జర్నలిస్టులు పండా త్రినాథ్, ఇజ్రాయిల్, మారుతి, మద్దాల మురళీ, సిహెచ్ వెంకటేశ్వర్రావు, రాము,



ఎన్నికైన నూతన పాలకవర్గం

రాంబాబు, సందీప్, ప్రభాకర్, ఇంజేటి రాజు, రాంబాబు, సత్తి బాబు, దివి వెంకటేశ్వరావు అభినందించారు. అనంతరం సమావేశంలో పలు అంశాలు, సమస్యలపై చర్చించారు.

15న పాటల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

మదర్ థెరిస్సా వికలాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు చిక్కాల నాగ శ్రీనివాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వలంధర రేవులో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సుల వారూ పాల్గొనవచ్చని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతోపాటు షీల్డ్ అందిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.200, పూర్తి వివరాలకు ఫోన్ 98480-2630255 సంప్రదించాలని పేర్కొన్నారు.

గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు నరహరి వరప్రసాద్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అప్పుడే గిరిజనులు అభివృద్ధి ముందుకు సాగుతుందని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మెట్టఉప్పరగూడెంలో ఎస్‌టి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం ఏకలవ్య జయంతి, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజన బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన రత్న సింగం పట్టాభి, జానకమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ సింగం కృష్ణ, గ్రామ అధ్యక్షుడు చినమర్తి దుర్గా ప్రసాద్, దానయ్య, సర్పంచి మర్లపాటి నాగభూషణం పాల్గొన్నారు.